ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
సోమవారం
25-05-2026
www.prajapaksham.in


## రిజర్వాయర్ భూసేకరణకు నిధులు సేకరణ హర్షణీయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానించిన జెఎసి నేతలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణకు నిధులు సమీకరించడం హర్షనీయమని షాద్‌నగర్ జేఎసి నేతలు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను జేఏసి నేతలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెఏసి నేతలు మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్ల తరబడి లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ కోసం వేచి చేస్తున్నారని, వారి కలను నిజం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో రిజర్వాయర్ భూసేకరణకు రూ.583కోట్లు కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని రైతులకు, ప్రజలకు తాగునీరు, సాగునీరు పుష్కలంగా లభిస్తాయని, దాంతో పంటల సాగు పెరిగే అస్కారం ఉంటుందని వివరించారు. 12ఏళ్లుగా లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ కోసం ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చోరవతోనే సాధ్యమైందని వివరించారు. కార్యక్రమంలో జెఏసి నేతలు జనార్ధన్, మార్కెట్ కమిటి డైరెక్టర్ కరుణాకర్, బాలరాజ్, నర్సింలు, టిఎన్‌జీవో అధ్యక్షుడు జె.శ్రీనివాసులు, అర్జున్‌కుమార్, సిద్దార్థ, రాము, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త డంపింగ్‌యార్డు రద్దు చేయాలి

సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్



**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తున్న గ్రామంలో వేయనున్న చెత్త డంపింగ్ యార్డును రద్దు చేయకుంటే తన సర్పంచ్ పదవికి రాజీనామ చేస్తానని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ హెచ్చరించారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్న చెత్త డంపింగ్ యార్డును తక్షణమే రద్దు చేయాలని లేదంటే ఉద్యమాలకు శ్రీకారం చుట్టడం కాయమని హెచ్చరించారు. సిద్దాపూర్ గ్రామస్తుల ఆరోగ్యాన్ని బలిపెడుతూ గ్రామాన్ని కాలుష్య కాసారంగా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్న డంపింగ్ యార్డు ప్రతిపాధనపై స్థానికులు నిప్పులు చెరుగుతున్నారని వివరించారు. ప్రభుత్వం తక్షణమే ఈ ప్రతిపాధనను వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంతో సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తామని హెచ్చరించారు. క్లీన్ విలేజ్..గ్రీన్ విలేజ్ అంటూ ఒకవైపు స్వచ్చత గురించి గొప్పలు చెబుతూనే మరోవైపు సిద్దాపూర్‌లో నగరాల చెత్తను పారబోసే డంపింగ్ యార్డ్‌గా మార్చాలని చూడటంపై సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయని వివరించారు. డంపింగ్ యార్డు వస్తే భూగర్భ జలాలు విషతుల్యమై, గాలి కలుషితమై రానున్న తరాలకు భవిష్యత్ పూర్తిగా నాశనం అవుతుందని వివరించారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి కాలుష్యకూపంలో బ్రతుకుతూ వచ్చే సర్పంచ్ పదవులు మాకొద్దు అంటూ స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం కంటే మాకు ఏ పదవి ముఖ్యం కాదని, తక్షణమే చెత్త డంపింగ్ యార్డు నిర్ణయాన్ని రద్దు చేయాలని లేదంటే సర్పంచ్ పదవికి రాజీనామ చేసి ప్రభుత్వానికి పంపించేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. పాలకులు మొండివైఖరీ విడి సిద్దాపూర్ గ్రామాన్ని కాపాడుతారా లేక ప్రజాప్రతినిధులు రాజీనామాలకు, తీవ్ర స్థాయి ప్రజా పోరాటాలకు దారి తీస్తారా అనేది వేచి చూడాల్సిందేనని అన్నారు.

## సామాజిక వర్గాలను సమానంగా చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే



**ప్రజాపక్షం/కొందుర్గు:** సామాజిక వర్గాలను సమానం చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ పాలమూరు..రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత పాలకులు తీవ్ర అన్యాయం చేశారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ప్రాజెక్టుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టడంతోపాటు లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణకు ప్రభుత్వం రూ.583కోట్ల నిధులు కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇప్పటికే కొందుర్గు మండలానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు తీసుకువచ్చి పనులు ప్రారంభించారని గుర్తు చేశారు. పెండింగ్‌లో ఉన్న ఎక్కిరాళ్ల బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కొందుర్గు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే పెద్ద ఎత్తున నిధులు కేటాయించి ముందుకు తీసుకువెళ్తున్నారని వివరించారు. కార్యక్రమంలో జితేందర్‌రెడ్డి, సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు గోపాల్‌నాయక్, శ్రీరంగాపూర్ సర్పంచ్ రమేష్, చిన్న ఎల్కిచర్ల సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

## కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** తాగునీటి సౌకర్యాలు, వీధిలైట్లకు మర్మత్తులు చేయించినట్లు కౌన్సిలర్ నడికూడ అనిత రఘునాథ్ యాదవ్‌లు తెలిపారు. ఆదివారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులోని రతన్ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ మౌళిక సదుపాయాల్లో భాగంగా తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ నిధులతో బోర్లకు మరమ్మత్తు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ 22వ వార్డులోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కేశంపేట రైల్వే గేటు సమీపంలోని భగత్‌సింగ్ కాలనీకి వెళ్ళె రోడ్డులో ఉన్న బొడ్రాయి విగ్రహా భద్రత కోసం గతంలో ఏర్పాటు చేసిన ఇనుప ఆంగ్లేర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటికి మర్మత్తులు చేయించినట్లు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజాసేవలో ముందుంటామన్నారు.

## పాకిస్తాన్ లింకుల అనుమానం.. మేడ్చల్‌లో హోటల్ ఉద్యోగి అరెస్టు

### సోషల్ మీడియా ద్వారా విదేశీ వ్యక్తులతో సంప్రదింపులు.. భద్రతా కోణంలో దర్యాప్తు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో భద్రతా వ్యవస్థలను అప్రమత్తం చేసే ఘటన వెలుగులోకి వచ్చింది. మేడ్చల్ ప్రాంతంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న వ్యక్తిని దేశ భద్రతకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాల కేసులో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సోషల్ మీడియా ద్వారా విదేశాల్లో ఉన్న అనుమానిత వ్యక్తులతో సంప్రదింపులు కొనసాగించినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన జయీద్ ఖాన్ కొంతకాలం క్రితం హైదరాబాద్‌కు వచ్చి మేడ్చల్ పరిసర ప్రాంతంలోని ఓ హోటల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. విచారణలో అతను ఇన్‌స్టాగ్రామ్ సహా సోషల్ మీడియా వేదికల ద్వారా పాకిస్తాన్‌కు చెందిన అనుమానాస్పద ఖాతాలతో సంప్రదింపులు కొనసాగించినట్లు గుర్తించినట్లు సమాచారం. ప్రాథమిక విచారణలో నిందితుడు విదేశాల్లోని వ్యక్తులతో తరచూ చాటింగ్ చేసినట్లు, ఆయుధాలు సమకూర్చుకోవడం, అక్కడికి వెళ్లే అవకాశాలపై ఆసక్తి వ్యక్తం చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే కొందరు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులకు సంబంధించిన బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారం, ఇతర వివరాలను పంచుకున్నాడా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

నిందితుడి మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని డిజిటల్ ఫోరెన్సిక్ విశ్లేషణ చేపట్టారు. ఫోన్‌లో సోషల్ మీడియా చాట్స్, కాల్ రికార్డులు, స్క్రీన్‌షాట్లు, ఇతర డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా అతని వద్ద నుంచి రెండు నకిలీ పిస్టల్స్ కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో రాష్ట్ర పోలీసులతో పాటు ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాలు కూడా రంగంలోకి దిగాయి. నిందితుడి సంప్రదింపుల పరిధి, విదేశీ వ్యక్తులతో ఉన్న సంబంధాల స్వరూపం, ఏదైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దారి తీసే ప్రయత్నాలున్నాయా అనే కోణాల్లో లోతుగా విచారణ జరుగుతోంది. అయితే ఇప్పటివరకు విచారణ కొనసాగుతున్న దశలోనే ఉండటంతో, అధికారికంగా నిర్ధారితమైన అంశాల ఆధారంగానే తదుపరి చర్యలు ఉంటాయని పోలీసులు తెలిపారు. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## యువ కార్మిక నాయకత్వం అవసరం

ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశానికి యువ కార్మిక నాయకత్వం అవసరం అని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు జి.సంజీవ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నారాయణగూడలోని రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో యువ కార్మిక నేత అద్వేల్లి శ్రీకాంత్‌ను ఐఎన్‌టియుసి మేడ్చల్ మల్కాజిగి అధ్యక్షునిగా నియమిస్తూ జి.సంజీవ రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక విధానాలకు వ్యతిరేకంగా యువ కార్మిక నేతలు ఉద్యమాలు తీవ్రతరం చేయాలని అన్నారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి మాట్లాడుతూ యువ కార్మికులను సమీకరించి, కార్మిక సంఘ ఉద్యమ పరిధిలోకి యువ నాయకులను తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రామిక ప్రజల ప్రయోజనం కోసం సమర్ధవంతమైన నాయకత్వ లక్షణాలను యువతలో పెంపొందించేందుకు ఐఎన్‌టియుసి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆదిల్ షరీఫ్, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్‌యాదవ్, కోశాధికారి జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎంఎంసి పరిధిలో మెరుగుపడిన పారిశుధ్యం

క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణతో స్పష్టమైన మార్పులు

టౌన్‌హాల్ మీటింగ్‌లో ఎంఎంసి తీరును ప్రశంసించిన అఖిలపక్ష నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలో పారిశుధ్య నిర్వహణ గతంతో పోలిస్తే గణనీయంగా మెరుగుపడిందని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు అభిప్రాయపడ్డారు. ఇటీవల నిర్వహించిన టౌన్ హాల్ సమావేశంలో వారు ఎంఎంసి అధికారుల పనితీరును ప్రశంసించారని అధికారులు చెప్పారు. నగరంలోని పలు కాలనీలు, ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాల్లో శుభ్రత పరిస్థితులు స్పష్టంగా మెరుగుపడ్డాయన్నారు. ఈ మార్పుకు ప్రధాన



కారణం కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్లు, పారిశుధ్య అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు, డిఈఈలు, ఏఈలు తదితర అధికారులు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్య కార్యక్రమాలను నేరుగా పర్యవేక్షించడమేనని తెలిపారు. ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌ను మరింత పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన నగరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో పారిశుధ్య నిర్వహణను మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు చర్యలు కొనసాగిస్తామని చెప్పారు. పారిశుధ్య అదనపు కమిషనర్ రఘుప్రసాద్ మాట్లాడుతూ అధికారులు ప్రతి రోజు ఉదయం నుంచే ఫీల్డ్‌లో ఉండి కాలనీల పరిశుభ్రత, చెత్త సేకరణ, డంపింగ్ పాయింట్ల నిర్వహణ, డ్రైనేజీ శుభ్రత వంటి అంశాలను సమీక్షిస్తూ సిబ్బందికి అవసరమైన సూచనలు అందిస్తున్నారని చెప్పారు. దీనివల్ల పారిశుధ్య నిర్వహణలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయన్నారు. పారిశుధ్య కార్మికులకు అవసరమైన చేతి గ్లౌజులు, మాస్కులు, తట్టలు, పారలు, చిన్న గునపాలు, కొడవళ్లు వంటి పరికరాలు, భద్రతా సామాగ్రి అందజేయడంతో వారు మరింత సమర్ధవంతంగా పనిచేస్తున్నారన్నారు. ఇక ఆదివారం 99 రోజుల కార్యాచరణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో రఘు ప్రసాద్ తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో ఉన్న ఇంకుడుగుంతలను పరిశీలించారు. వాటికి అవసరమైన మరమ్మతులు వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం

రెండు రోజుల్లో 438 మందిపై కేసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రత లక్ష్యంగా నగరవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 438 మంది డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. మే 22, 23 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో ఈ కేసులు నమోదైనట్లు హైదరాబాద్ ట్రాఫిక్ శాఖ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ వెల్లడించారు. పట్టుబడిన వారిలో అత్యధికంగా ద్విచక్ర వాహనదారులే ఉన్నారు. మొత్తం 438 కేసుల్లో 365 మంది ద్విచక్ర వాహనదారులు ఉండగా, త్రిచక్ర వాహనాలు నడిపిన 25 మంది, నాలుగు చక్రాల వాహనాలు నడిపిన 47 మంది, ఇతర వాహనాల కేటగిరీలో ఒకరు ఉన్నారు. తనిఖీల సందర్భంగా బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా, పలువురిలో అధిక స్థాయిలో ఆల్కహాల్ నమోదైంది. 30–50 మిల్లీగ్రాముల బీఏసీ స్థాయిలో 98 కేసులు నమోదు కాగా, 51–100 మిల్లీగ్రాముల మధ్య అత్యధికంగా 191 కేసులు నమోదయ్యాయి. అలాగే 101–150 మిల్లీగ్రాముల మధ్య 83 కేసులు, 151–200 మిల్లీగ్రాముల మధ్య 42 కేసులు నమోదయ్యాయి. 201–250 మిల్లీగ్రాముల స్థాయిలో 13 మంది, 251–300 మిల్లీగ్రాముల స్థాయిలో ఆరుగురు, 300 మిల్లీగ్రాముల కంటే ఎక్కువ స్థాయిలో ఐదుగురు వాహనదారులు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడపడం కేవలం వ్యక్తిగత ప్రాణాలకే కాకుండా రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదకరమని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై 'జీరో టాలరెన్స్' విధానం కొనసాగుతుందని, ఇలాంటి ప్రత్యేక తనిఖీలు భవిష్యత్తులోనూ నిరంతరంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. నగరంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు, సురక్షిత ప్రయాణ వాతావరణం కోసం ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



అదనపు కలెక్టర్ కిరణ్మయి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా తగు సౌకర్యాలు కల్పించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. ఆదివారం రాష్ట్ర కేంద్రం నుంచి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఖమ్మం జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్లతో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయ సముదాయం నుండి అదనపు కలెక్టర్ కిరణ్మయి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని, అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బ తినకుండా జిల్లాలో గుర్తించిన గోదాములు, కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వనజాత, జిల్లా మేనేజర్ జె హరీష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎల్.శ్రీలత, సిపిఓ సౌమ్య, జిల్లా సహకార అధికారి సుధాకర్, జిల్లా పంచాయతీ శాఖ ఇఇ శ్రీరామ్ రాములు, డిఎంహెచ్‌ఓ స్వర్ణ కుమారి, మెప్మా పిడి వెంకట నారాయణ, సంబంధితఅధికారులు పాల్గొన్నారు.


## తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తూ కిందపడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలంలోని తిమ్మాపూర్ లో ఆదివారం వారం చోటు చేసుకుంది.సంఘటనకు సంబందించి స్థానికులు, పోలీస్‌ల కథనం ప్రకారం కందుకూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ముద్దగౌని అంజయ్య గౌడ్ ప్రతిరోజు తాటి చెట్లు ఎక్కి కల్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు.రోజు వారి మాదిరిగానే ఆదివారం సాయంత్రం చెట్లు గీయడానికి వెళ్లిన ముద్దగౌని అంజయ్య గౌడ్ ప్రమాద ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుండి కిందపడ్డాడు.దీంతో తీవ్రగలైన అంజయ్య గౌడ్ అక్కడికక్కడే మృతి చేద్దాడు.ఈ మేరకు పోలీస్ లు మృతదేహన్ని పోస్ట్ మార్టమ్ నిమిత్తం ప్రభుత్వఆస్పత్రి తరలించి కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు..

## నేటి నుంచి మహిళా వారోత్సవాలు

ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మే 25(నేటి)నుండి 30 వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. "ప్రజాపాలన ప్రగ తి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా మహిళా సంక్షేమం, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, పోషకాహారం, బాల్య వివాహాల నిర్మూలన, మహిళల భద్రత,ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలపై నేటి నుండి 30వ తేదీ వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా అధికారులు, థీమ్ నోడల్ అధికారులు, తహసిల్దార్‌లు, ఎంపిడిఓ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.మహిళా సంఘాల ఆర్థిక సాధికారత, అంగన్‌వాడీ సేవల బలోపేతం, మహిళల భద్రత, బాలికల అభివృద్ధి, వృద్ధ మహిళల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మహిళ వారోత్సవాలను వివిధ శాఖ ల జిల్లా అధికారులు,ఎంపిడిఓ లు, సంబంధిత శాఖల సిబ్బంది అన్ని కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి, జిల్లా గ్రామీణ అభివృద్ధి,మహిళా సంక్షేమ అధికారి ఎల్ శ్రీలత,మెప్మా పిడి వెంకట నారాయణ,మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, సిడిపిఒలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పాలమూరు ప్రజలను మోసం చేసింది బిఆర్‌ఎస్సే

రాష్ట్ర పశుసంవర్థక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి





**ప్రజాపక్షం/షాద్‌నగర్:** లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌కు టెండర్లు వేయకుండానే 95శాతం పనులు పూర్తి చేశామని బిఆర్‌ఎస్ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటని రాష్ట్ర పశుసంవర్థక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. అంతకుముందు మంత్రి వాకిటి శ్రీహరికి ఎమ్మెల్యేతోపాటు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి వాకటి శ్రీహరి మాట్లాడుతూ శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ వరకు మొత్తం 21స్టేజీలను ఏర్పాటు చేశారు.. అందులో కేవలం 18స్టేజీలకు మాత్రమే టెండర్లు వేశారే తప్పా మిగిలిన మూడు స్టేజీలకు ఎందుకు టెండర్లు వేయలేదో చెప్పాలని బిఆర్‌ఎస్ నేతలను డిమాండ్ చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుండి బిఆర్‌ఎస్ నేతలను రెండు సార్లు ఈ ప్రాంత ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే అన్యాయమే చేశారే తప్పా న్యాయం లేదన్నారు. రైతు గోస తెలిపిన పాలమూరు ముద్దు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంతోపాటు లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ భూ సేకరణకు రూ.583కోట్ల నిధులకు మంత్రివర్గం అమోదం తెలిపిందని వివరించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతోనే రిజర్వాయర్ భూసేకరణకు రూ.583కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏమి చేశారో బిఆర్‌ఎస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంతోపాటు ఇరిగేషన్ శాఖ ద్వారా అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు మంత్రి వాకటి శ్రీహరి వివరించారు.

### కుర్చీవేసుకొని లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామన్న కెసిఆర్ ఎక్కడా..

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పాలమూరు పార్లమెంట్ ఎంపిగా పోటీ చేసే సమయంలో కుర్చీ వేసుకొని కూర్చొని లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్పి కెసిఆర్ ఈ ప్రాంత ప్రజలను మోసం చేశాడని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. ఓట్ల కోసమే లక్ష్మీ దేవిపలి రిజర్వాయర్‌ను తెరపైకి తీసుకువచ్చారే తప్పా తట్టెడు మట్టి తీయలేదని, ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌కు నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్, మండల పార్టీల అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, జాకారం శేఖర్, శేఖర్‌రెడ్డి, కుమారస్వామి గౌడ్, రమేష్, పురుషోత్తంరెడ్డి, నల్లమోని శ్రీధర్, సుదర్శన్ గౌడ్, నేతలు మహ్మద్ ఇబ్రహీం, కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, రాజు, ఉపసర్పంచ్ అశోక్ పాల్గొన్నారు.

# 'మహిళా వారోత్సవాలు' ప్రారంభం

## నేడు వర్చువల్‌లో 8వేల మహిళా భవనాలకు సిఎం శంకుస్థాపన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం నుంచి ఈనెల 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు నిర్వహించనున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి అవకాశాలు, ఆరోగ్యం, పోషణ, పారిశ్రామిక ప్రగతిని ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖలు, సెర్ప్, మెప్మాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులను, ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పారిశ్రామిక ప్రదర్శనలు, ఆరోగ్య శిబిరాలు, యువతకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మహిళా సాధికారత కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.

మహిళలను లబ్ధిదారుల స్థాయి నుంచి పారిశ్రామిక వేత్తలుగా, సంపద సృష్టికర్తల స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళా సంఘాలకు ఐదేళ్ల కాలంలో బ్యాంక్ లింకేజీ ద్వారా లక్ష కోట్ల రూపాయల రుణ సదుపాయం కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు మహిళా సంఘాలకు రూ.60,487 కోట్ల రుణాలను అందించారు. తద్వారా మహిళలు సొంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు రూ.1397 కోట్ల వడ్డీని మహిళా సంఘాలకు ప్రభుత్వం రాయితీగా చెల్లించగా, మహిళా వారోత్సవాల్లో మరో రూ.650 కోట్లను చెల్లించనున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 222 మహిళా సంఘాల క్యాంటీన్లు ఏర్పాటు చేయగా, ఒక్కో యూనిట్ నెలకు సగటున రూ.72వేల వరకు లాభాలు ఆర్జిస్తున్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయ. మహిళల నిర్వహణలో పెట్రోల్ బంకులు విజయవంతంగా కొనసాగుతున్నాయి.

మహిళా సమాఖ్యలు రూ.199కోట్ల పెట్టుబడితో 553 ఆర్‌టిసి బస్సులు కొనుగోలు చేసి అద్దె ప్రాతిపదికన టిజిఎస్‌ఆర్‌టిసికి అందించాయి. ఒక్కో బస్సు ద్వారా నెలకు సుమారు రూ.70 వేల వరకు ఆదాయం లభిస్తోంది.అలాగే మహిళా సంఘాల ఆధ్వర్యంలోని రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఒలు) దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానమవుతున్నాయి. మామిడి, మిర్చి, పసుపు, కంది వంటి పంటలను రిటైల్ చైన్లు, ఈకామర్స్ వేదికలు, ఎగుమతి మార్కెట్లకు సరఫరా చేసే వ్యవస్థను అభివృద్ధి చేశారు. మహిళా వారోత్సవాల సందర్భంగా 6మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ప్రారంభించనున్నారు.

**మహిళా వారోత్సవాల ముఖ్య కార్యక్రమాలు**

ఈనెల 25న(సోమవారం) ఇందిరా మహిళా శక్తి భవనాల శంకుస్థాపనలు, 26న సోలార్ ప్లాంట్ల ప్రారంభం, ప్రత్యేక సాధారణ సమావేశాలు. మే 29న ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్, లోన్ మేళాలు. **30న ఉల్లాస్ కార్యక్రమం, బాలికల మాక్ పార్లమెంట్**

**నేడు వర్చువల్‌లో సిఎం చేతుల మీదుగా 8వేల మహిళా భవనాలకు శంకుస్థాపన**

రాష్ట్రవ్యాప్తంగా నిర్మించనున్న 8వేల గ్రామ మహిళా భవనాలకు సోమవారం సాయంత్రం 4.00 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. భవనాల శంకుస్థాపన అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో మహిళా సంఘాల ప్రతినిధులతో సిఎం ప్రత్యక్షంగా ముచ్చటించి, మహిళా సాధికారతపై ప్రభుత్వ లక్ష్యాలను వివరించనున్నారు. మహిళల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకుంటూ వారి అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా ఇవ్వనున్నారు.



# విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర

## మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌డిఎస్‌ఎస్ విధానాన్ని మొదటి నుంచి కూడా కెసిఆర్ వ్యతిరేకించారని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి అన్నారు. ఈ విధానం ద్వారా విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఆర్‌డిఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా బిఆర్‌ఎస్ మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతుందన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో ఆర్‌డిఎస్‌ఎస్ పథకం కింద మీటర్లను బిగించారని, దీనిని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున మహిళలు వేలాదిగా రోడ్డుపైకి వచ్చి ఆ మీటర్లను తగలబెట్టారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆర్‌డిఎస్‌ఎస్ పథకం ద్వారా ప్రతిఒక్కరి ఇంట్లో మీటర్లు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, ఈ మీటర్ల ద్వారా ప్రజలకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మీటర్ విధానం ద్వారా ముందుగానే రీచార్జ్ చేసుకోవాలని, లేదంటే కరెంట్ కట్ అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్సంటేజీలతోఈ మీటర్ల ఖర్చు ఎంతకు పోతుందో తెలియదన్నారు. కొత్తగా రూరల్ డిస్కము తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోందని, ఈ డిస్కంను అదానీకి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. ఆర్‌డిఎస్‌ఎస్ పథకానికి ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ వ్యతిరికిస్తూ,నిరసన కార్యక్రమాలను చేపట్టిందని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఆర్‌డిఎస్‌ఎస్ పథకానికి అనుకూలంగా ఎలా ఉంటుందని ప్రశ్నించారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికకు యువత మద్దతు

## రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా ముగిసిన యువజన-క్రీడల వారోత్సవాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ సేవలు ప్రతి పౌరుడికి చేరేలా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన క్రీడల వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా ముగిశాయి. ఈ నెల 18 నుంచి 23 వరకు ఆరు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో యువత, క్రీడాకారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. యువతలో శారీరక దారుఢ్యం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టారు.రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో విజయవంతంగా కార్యక్రమాలను నిర్వహించడంలో జిల్లా యంత్రాంగం, వివిధ శాఖల సమన్వయం కీలకంగా నిలిచిందని అధికారులు తెలిపారు. యువత, విద్యార్థులు, క్రీడా సంఘాలు చురుకుగా పాల్గొనడం పట్ల రాష్ట్ర క్రీడలు-యువజన సర్వీసుల శాఖ అధికారులు అభినందనలు తెలిపారు.మే 20న నిర్వహించిన యువజన నాయకత్వ సమ్మేళనంలో యువతలో నాయకత్వ నైపుణ్యాలు, సామాజిక అవగాహన, సృజనాత్మకత పెంపొందించే అంశాలపై చర్చలు జరిగాయి. యూత్ లీడర్‌షిప్ సమ్మిట్, యువజన పార్లమెంట్, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విద్యార్థులు, యువకులను భాగస్వామ్యం చేశారు.

**'ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ'తో ఘన ప్రారంభం**

వారోత్సవాల తొలి రోజు ఫిట్ అండ యాక్టివ్ తెలంగాణ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా మారథాన్‌లు, వాక్‌థాన్‌లు, యోగా, ధ్యానం, ఏరోబిక్స్, జుంబా కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో 5 కిలోమీటర్ల మారథాన్‌కు విశేష స్పందన లభించగా, జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.

**నైపుణ్యాభివృద్ధి – కెరీర్ అవకాశాలపై అవ-గాహన**

రెండో రోజు నిర్వహించిన కెరీర్ , స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో యువతకు నైపుణ్యాభివృద్ధి కోర్సులు, స్పోర్ట్స్ యూనివర్సిటీలు, స్కిల్ యూనివర్సిటీ అవకాశాలు, అగ్నివీర్ నియామకాలపై అవగాహన కల్పించారు. వర్చువల్ సెషన్లకు విద్యార్థులు, యువత నుంచి మంచి స్పందన లభించింది.

**జాబ్ మేళాలతో యువతకు ఉపాధి దిశగా అడుగులు**

వారోత్సవాల చివరి రోజు యువతకు ఉపాధి అవకాశాలపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. మే 1 నుంచి 12 వరకు నిర్వహించిన జాబ్ మేళాల్లో దాదాపు 40 వేల మంది యువకులు నమోదు చేసుకోగా, 22 వేల మందికి పైగా ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 11,200 మంది షార్ట్‌లిస్ట్ కాగా, సుమారు 5,700 మందికి వివిధ సంస్థలు నియామక పత్రాలు అందజేశాయి.




# విదేశీ ఆస్తులను దాచిపెట్టడం చాలా ప్రమాదకరం

## ఆదాయపు పన్ను కమిషనర్ వై. శ్రీకాంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతీయ నివాసితులు విదేశీ ఆదాయం, ఆస్తులు వివరాలను వెల్లడించకపోవడం చట్టరీత్యానేరమని, క్రిమినల్ కేసులు తప్పవని తెలంగాణ అండ్ ఎపి అదనపు ఆదాయపు పన్ను కమిషనర్ వై. శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓహోటల్‌లో తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్లాక్ మనీ యాక్ట్ – లా అండ్ ప్రాక్టీస్ పై అవగాహన సదస్సు అసోసియేషన్ అధ్యక్షులు సిఏ చంద్రశేఖర్ వేముల అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు వై. శ్రీకాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నల్లధనం (వెల్లడించని విదేశీ ఆదాయం, ఆస్తులు) పన్ను విధింపు చట్టం, 2015 అనేది భారతీయ పౌరుల వద్ద ఉన్న వెల్లడించని విదేశీ ఆదాయం, ఆస్తులపై జరిమానా విధించడానికి, పన్ను విధించడానికి రూపొందించబడిన ఒక భారతీయ చట్టం అని, ఇది వెల్లడించని ఆస్తుల విలువపై ఫ్లాట్ 30శాతం పన్ను, 300 శాతం జరిమానాతో పాటు, తీవ్రమైన క్రిమినల్ విచారణను కూడా విధిస్తుందని చెప్పారు. బ్లాక్ మనీ చట్టం యొక్క ఉద్దేశ్యం విదేశాల్లో దాచిన ఆదాయాలు, ఆస్తులను గుర్తించి పన్ను వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావడమేనని తెలిపారు. విదేశీ బ్యాంకు ఖాతాలు, షేర్లు, ఆస్తులు, కంపెనీలలో పెట్టుబడులు వంటి అంశాలను ఆదాయపు పన్ను రిటర్నుల్లో తప్పనిసరిగా సరైన విధంగా వెల్లడించాలని ఆయన స్పష్టం చేశారు. సిఏ చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ పన్ను నిపుణులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, న్యాయవాదులు, పన్ను చెల్లింపుదారులకు చట్టంలోని ముఖ్య అంశాలపై విస్తృత అవగాహన సదస్సును తమ అసోసియేషన్ నిర్వహించిందని తెలిపారు. ఈ సదస్సులో అసోసియేషన్ కార్యదర్శి ఆశిష్ జోషి, కోశాధికారి సోమేశ్వర్ నెమ్మాని, సలహాదారు రామ్‌దేవ్ బుటాడా, కంపిటేషన్ కమిటీ చైర్మన్ అమృత్ కుమార్ కోటా, ఉపాధ్యక్షులు పి.వి. నారాయణరావు, మాజీ అధ్యక్షులు హితేష్ జైన్, పూర్ణచంద్రరావు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు రమణ రెడ్డి, ప్రవల్లిక వేముల, ఎన్.వి. చారి, అజయ్ వాల్వే, ఎపి దహిమా తదితరులు పాల్గొన్నారు.

# చౌక చమురు ఎందుకు కొనుగోలు చేయరు?

## కేంద్రాన్ని నిలదీసిన అరవింద్ కేజ్రీవాల్

**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పెరుగుతున్న ధరలు, తీవ్రమవుతున్న ఇంధన సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. ప్రభుత్వం ఇంధన ధరలను అనేక సార్లు పెంచడం ద్వారా ప్రజలను 'నెమ్మదిగా విషానికి' గురిచేస్తోందని విమర్శించారు. రష్యా, ఇరాన్ నుంచి వస్తున్న చౌక చమురు, గ్యాస్ దిగుమతి ప్రతిపాదనలను ఎందుకు నిరాకరిస్తోందని ప్రశ్నిస్తూ, తక్కువ ధరలకు ఆ రెండు దేశాల నుంచి భారత్ ఇంధనాన్ని కొనుగోలు చేయాలా వద్దా అనే దానిపై కామెంట్లు, డైరెక్ట్ మెసేజ్‌ల ద్వారా తమ అభిప్రాయాలను పంచుకోవాలని ఆప్ అధినేత పౌరులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు 'ఎక్స్' లో ఒక వీడియోను పంచుకుంటూ, ఈరోజు మరోసారి భారత ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. గత 10 నుంచి 15 రోజుల్లో ఇది వదవ పెంపు. ప్రభుత్వం ప్రజలకు 'నెమ్మది విషం' ఇస్తోంది. గత 10 నుంచి 15 రోజుల్లో, పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు దాదాపు రూ.4 నుంచి రూ.5 వరకు పెరిగాయి. గ్యాస్ సిలిండర్ల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. 'ప్రజలు తమ ఇళ్లను నడుపుకోవడానికే ఇబ్బంది పడుతున్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను ఇంకా ఎంత పెంచబోతోందో తెలియక ప్రజలు తీవ్ర భయాందోళనలకు, దిగ్భ్రాంతికి గురయ్యారు. ధరలు ఇంకా చాలా పెరుగుతాయని, పెట్రోల్ ధర రూ.150కి చేరవచ్చని వదంతులు వ్యాపిస్తున్నాయి. అది ఎంత వరకు వెళుతుందో ఎవరికీ తెలియదు. ప్రజలు ప్రభుత్వాన్ని అడిగితే, ప్రభుత్వం ఏమీ చెప్పడం లేదు' అని అన్నారుఖ. 'డీజిల్ అందుబాటులో లేకపోవడంతో గుజరాత్‌లోని పెట్రోల్ పంపుల వద్ద ట్రాక్టర్లు బారులు తీరిన దశ్యాలు కనిపిస్తున్నాయి. అనేక చోట్ల ప్రజల మధ్య ఘర్షణలు చెలరేగుతున్నాయి. ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ప్రజలు రాత్రి పూట రోడ్ల పైనే నిద్రిస్తున్నారు. తమ గ్యాస్ సిలిండర్లను నింపుకోవడానికి, ప్రజలు పొడవైన క్యూలలో నిలబడుతున్నారు. మహారాష్ట్రలోని అకోలా, బులాధనా ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. రాబోయే రోజుల్లో ఏం జరగబోతోంది. పరిస్థితి ఎంత తీవ్రంగా మారబోతుందనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వివరించాలని ఈ దేశ ప్రజలు కోరుకుంటున్నారు. కానీ ప్రభుత్వం ప్రజలకు ఏమీ చెప్పడం లేదు' అని ఆయన తెలిపారు. 'రష్యా, ఇరాన్ దేశాలు రెండూ భారతదేశానికి చౌక ధరలకే చమురు, గ్యాస్ సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్నాయి. కానీ భారత ప్రభుత్వం మాత్రం వారి నుంచి కొనుగోలు చేయబోమని అంటోంది. అసలు ఎందుకు కొనదు? భారత ప్రభుత్వం రష్యా, ఇరాన్ నుంచి చౌక ధరకు చమురు, గ్యాస్ కొనుగోలు చేయాలా వద్దా అనే విషయాన్ని నేను ఈ దేశ ప్రజలనే అడగాలనుకుంటున్నాను' అని పేర్కొన్నారు. 'ఈ దేశం మనందరిదీ, కేవలం ఈ నాయకులదో లేదా ఏదో ఒక రాజకీయ పార్టీదో కాదు.

# భూముల మార్కెట్ విలువల పెంపునకు రంగం సిద్ధం

## నేడో రేపో సర్కార్ నుండి వెలువడనున్న అధికారిక ప్రకటన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో భూములు, ఇళ్ల స్థలాలు, అపార్ట్మెంట్ల రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలను పెంచేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈనెల 28 నుంచి సవరించిన మార్కెట్ విలువలను అమల్లోకి తీసుకురానున్న నేపథ్యంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కసరత్తు దాదాపు పూర్తి చేసింది. ఒకటి రెండు రోజుల్లో పూర్తి నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు సమాచారం. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రానికి ఏడాదికి రూ.2 వేల కోట్లకుపైగా అదనపు ఆదాయం వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం 2021, 2022 సంవత్సరాల్లో రెండుసార్లు మార్కెట్ విలువలను సవరించింది. అనంతరం నాలుగేళ్లుగా రిజిస్ట్రేషన్ విలువల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ఇదే సమయంలో బహిరంగ మార్కెట్లో భూముల ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువలు, వాస్తవ మార్కెట్ ధరల మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఇళ్ల స్థలాలు, భవనాలు, అపార్ట్‌మెంట్‌ల విలువలపై అధ్యయనం చేపట్టింది. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో రివిజన్ ఆఫ్ మార్కెట్ వాల్యూస్ మార్గదర్శక కమిటీలు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించాయి.

జాతీయ రహదారులు, 30 అడుగుల నుంచి 100 అడుగుల వరకు వెడల్పాటి రహదారులు ఉన్న ప్రాంతాలు, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలు, పట్టణ విస్తరణ ప్రాంతాలను వేర్వేరు కేటగిరీలుగా విభజించి ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను విశ్లేషించారు. బహిరంగ మార్కెట్ ధరలు, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఆధారంగా చేసుకుని మూడు శ్లాబుల్లో పెంపు ప్రతిపాదనలు చేశారు. తక్కువ వ్యత్యాసం ఉన్న ప్రాంతాల్లో 25 శాతం, ఎక్కువ వ్యత్యాసం ఉన్న ప్రాంతాల్లో 50 శాతం, వేగంగా అభివృద్ధి చెందిన వాణిజ్య ప్రాంతాల్లో 100 శాతం వరకు మార్కెట్ విలువలను పెంచాలని కమిటీ సూచించింది. ఇళ్ల స్థలాలు, భవనాలు, అపార్ట్‌మెంట్‌ల విషయంలో కూడా ఇదే విధంగా 25, 50, 100 శాతం పెంపు ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. గ్రామాలు, పట్టణాలు, వార్డులను యూనిట్లుగా తీసుకుని సగటు మార్కెట్ విలువల ఆధారంగా సవరణలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో సిద్ధమైన నివేదికలను హైదరాబాద్‌లోని ఐజి కార్యాలయంలో అదనపు ఐజిలు, జాయింట్ ఐజిలు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లు సమీక్షించినట్లు తెలిసింది. సమీక్ష ప్రక్రియ పూర్తికావడంతో సోమవారం లేదా మంగళవారం ప్రభుత్వం పెరిగిన మార్కెట్ విలువల పూర్తి వివరాలను ప్రకటించే అవకాశం ఉంది.

గతంతో పోలిస్తే ఈసారి పారదర్శకంగా, క్షేత్రస్థాయి అవగాహనతో మార్కెట్ విలువల సవరణ ప్రక్రియ చేపట్టినట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెప్పుతున్నారు.



# నేటి నుండి 'రైతు గోస – బిజెపి భరోసా' బస్సు యాత్ర

## ధాన్యం కొనుగోలులో విఫలమైన కాంగ్రెస్ సర్కార్
## బిజెపి నేతలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఘోరంగా వైఫల్యం చెందిందని బిజెపి విమర్శించింది. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకుని, వారికి అండగా నిలబడేందుకు సోమవారం నుండి రాష్ట్రవ్యాప్తంగా 'రైతు గోస బిజెపి భరోసా' పేరిట ప్రత్యేక బస్సు యాత్రను చేపట్టనున్నట్లు నేతలు ప్రకటించారు. హైదరాబాద్ నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బిజెఎల్‌పి నేత మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ మల్క కుమరయ్య, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, సిర్పూర్ కాగజ్ నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు నర్సయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గౌతమ్ రావు, జయశ్రీ పాల్గొన్నారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల మధ్య రైతు సమస్యల పరిష్కారం విషయంలో పెద్దగా తేడా లేదని విమర్శించారు. మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు 30 శాతం కూడా ధాన్యం కొనుగోలు పూర్తి చేయలేదని ఆరోపించారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు బిజెపి నేతలు బస్సు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. నాంపల్లిలోని బిజెపి కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని కుల్కచర్ల మండలం నుంచి మొదలై గజ్వేల్, జనగాం, వరంగల్, పెద్దపల్లి వరకు కొనసాగుతుందన్నారు.

# న్యాయవాది ఖాజా మొహిజుద్దీన్ హత్య కేసులో కీలక పురోగతి

## కల్వకుర్తి, గోవాలో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు..?

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో సంచలనం సృష్టించిన సీనియర్ న్యాయవాది ఖాజా మొహిజుద్దీన్ హత్య కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మొదట రోడ్డు ప్రమాదంగా కనిపించిన ఘటన, సిసిటివి ఫుటేజీలు, కుటుంబ సభ్యుల ఫిర్యాదులతో హత్య కోణంలోకి మళ్లిన నేపథ్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. మసాబ్‌ట్యాంక్ శాంతినగర్‌లో నివాసం ఉంటున్న ఖాజా మొహిజుద్దీన్ (63) శనివారం ఉదయం తన కారులో బయటకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా వేగంగా వచ్చిన ఓ ఎస్‌యూవీ వాహనం ఆయనను బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. సంఘటన దృశ్యాలు బయటకు రావడంతో ఇది సాధారణ ప్రమాదం కాదన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. కుటుంబ సభ్యులు ఈ ఘటన వెనుక ముందస్తు ప్రణాళిక ఉందని ఆరోపించారు. ముఖ్యంగా వక్ఫ్ భూములకు సంబంధించిన వివాదాస్పద కేసుల్లో మొహిజుద్దీన్ వాదనలు వినిపిస్తున్న నేపథ్యంలో గతంలో కూడా బెదిరింపులు వచ్చాయని కుటుంబం పోలీసులకు తెలిపింది.



ఆయన కుమారుడు ఫర్హాన్ చేసిన ఫిర్యాదు ఆధారంగా హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేసి సిసిటివి ఫుటేజీలు, వాహనం కదలికలు, కాల్ డేటా, అనుమానితుల సంబంధాలపై విచారణ చేపట్టాయి. కొన్ని మీడియా నివేదికల ప్రకారం కవాడిగూడకు చెందిన వినయ్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించి, కల్వకుర్తి, గోవా ప్రాంతాల్లో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అయితే దీనిపై పోలీసులు ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది. మరోవైపు కొన్ని నివేదికల ప్రకారం కేసుకు సంబంధించి అనుమానితులను ఇతర రాష్ట్రాల్లో గుర్తించి అదుపులోకి తీసుకొచ్చినట్లు కూడా సమాచారం వెలువడింది.

దాడికి ఉపయోగించిన వాహనం, దాని యాజమాన్యం, ముందస్తు రెక్కీ జరిగిందా అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటన న్యాయవాదుల్లో ఆందోళనకు దారితీయగా, పూర్తి స్థాయి దర్యాప్తు చేసి కుట్ర కోణం సహా అన్ని అంశాలు వెలుగులోకి తీసుకురావాలని న్యాయవాద సంఘాలు డిమాండ చేస్తున్నాయి.

# గోదావరి జలాల వినియోగంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణకు కేటాయించిన గోదావరి జలాల వినియోగంలో, నీటిపారుదల ప్రాజెక్టుల ప్రణాళిక, అమలులో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి గణనీయమైన కాలం పూర్తయినప్పటికీ, రాష్ట్రానికి దక్కాల్సిన గోదావరి నీటి వాటాను సద్వినియోగం చేసుకోవడంలో ఎలాంటి పురోగతి లేకపోవడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ట్రిబ్యునల్ కేటాయించిన 968 టిఎంసిల గోదావరి జలాలను తెలంగాణ ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణ చర్యలు చేపట్టాలని, గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

# బిసి గురుకుల జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ సీట్ల కేటాయింపు

## 24 నుంచి 29 వరకు సంబంధిత కాలేజీల్లో రిపోర్ట్ చేయాలి
## కార్యదర్శి బడుగు సైదులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర బిసి గురుకుల విద్యా సంస్థ (ఎంజెపిటిబిసిడబ్ల్యుఆర్ఇఐఎస్) ఆధ్వర్యంలో 2026 27 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్మీడియట్ (ఆర్‌జెసి), డిగ్రీ కాలేజీ అడ్మిషన్లకు సంబంధించి మొదటి దశ ఫలితాలు సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఆదివారం ప్రకటించారు. 'దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఫలితాలను, కాలేజీ వివరాలను https://mjptbcwreis.telangana.gov.in (లేదా) https://mjptbcadmissions.org/MJPInter అధికారిక వెబ్‌సైట్లలో ద్వారా ఇంటర్ ఫలితాలను పరిశీలించవచ్చు. ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా 10వ తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతోంది. https:// mjptbcadmissions.org/MJPౖegree/ అధికారిక వెబ్ సైట్ ద్వారా డిగ్రీ కాలేజీ అడ్మిషన్ల ఫలితాలు తెలుసుకోవచ్చని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరించారు. ఎంపికైన విద్యార్థులు తగిన డాక్యుమెంట్లు సిద్ధం చేసుకొని, ఈనెల 24 వ తేదీ నుండి 29వ తేదీ వరకు సంబంధిత కాలేజీల్లో అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 04023328266 లో సంప్రదించాలని కార్యదర్శి సూచించారు.

# ఉచిత విద్యుత్తు రద్దు కోసమే కాంగ్రెస్ మోటార్లకు మీటర్లు

## బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్

**ప్రజాపక్షం/అంబర్‌పేట్ :** రాష్ట్రంలో ప్రీపెయిడ్ మీటర్లు తీసుకువచ్చేందుకు.. వ్యవసాయ మోటార్లకి మీటర్లు పెట్టేందుకు... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న ఉచిత విద్యుత్‌ను ఎత్తగొట్టేందుకు, ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని పూర్తిగా ఆదానీ వంటి ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన ఆరోపించారు. ఆదివారం అంబర్‌పేట్ బిఆర్‌ఎస్ పార్టీ బూత్ లెవెల్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మోటార్లకు మీటర్లు పెట్టి పూర్తిగా రైతన్నలకు ఉచిత విద్యుత్తును కాంగ్రెస్ ఎత్తగొట్టే కుట్ర చేస్తున్నదన్నారు. దీంతో పాటు ప్రతి ఒక్కరి ఇంట్లో ప్రస్తుతం ఉన్న మీటర్లు తొలగించి ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. ఈ మేరకు నిన్న క్యాబినెట్‌లో మీటర్లన్నింటినీ తొలగించి ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. మొత్తం గ్రామాల్లో, పట్టణాల్లో వ్యవసాయాలకు ప్రీపెయిడ్ మీటర్లు వస్తాయన్నారు.మోటార్లకు మీటర్లు రాకముందే ప్రతి ఒక్కరి ఇంట్లో ప్రీపెయిడ్ మీటర్లు తేక ముందే కాంగ్రెస్ పార్టీ ఫ్యూజులు తీసివేయాలని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ విద్యుత్ రంగంలో చేస్తున్న కరెంటు కుట్రలపైన తిరగబడాలని కోరారు. ఎన్నికల ముందే ప్రజలకు భారత రాష్ట్ర సమితి కాంగ్రెస్ వస్తే ఉచిత విద్యుత్తు పోతుందని హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. మోటర్ల దగ్గర మీటర్లు వస్తాయని,ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో ప్రైవేట్ సంస్థలకు విద్యుత్ రంగాన్ని అప్పజెప్తారని కెసిఆర్ హెచ్చరించారని కేటీఆర్ గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ప్రజలు వ్యతిరేకిస్తున్న ప్రీపెయిడ్ మీటర్లను కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తీసుకురావడం దారుణం అన్నారు. ఈ ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎంత ఒత్తిడి చేసినా, రూ.30 వేల కోట్ల రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఆపినా కేసీఆర్ ఎదిరించారని, మీటర్లు పెట్టలేదని తెలిపారు. కానీ రానున్న మూడు నెలల్లోనే మొత్తం మీటర్లు పెడతామని చెప్పి నిన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని కేటీఆర్ అన్నారు. రానున్న మూడు నెలల్లోనే ఉన్న మీటర్లు పీకేసి, ప్రీపెయిడ్ మొబైల్స్ మాదిరి ప్రీపెయిడ్ కరెంట్ మీటర్లను తీసుకురాబోతున్నదని కేటీఆర్ అన్నారు. అయితే కాంగ్రెస్ ఉచిత కరెంట్ ను ఎత్తగొట్టడం కోసమే ప్రీపెయిడ్ మీటర్లను తీసుకువస్తుందని కేటీఆర్ ఆరోపించారు. కేవలం ఉచిత కరెంట్ ను రద్దు చేయాలన్న ఏకైక ఉద్దేశంతోనే అదానీ, అంబానీలకు విద్యుత్ సంస్థలను అప్పగించాలన్న లక్ష్యంతోనే క్యాబినెట్ నిన్న ఈ నిర్ణయం తీసుకున్నదన్నారు.



# వడ్డెరల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా: కూన



ప్రజాపక్షం/ నిజాంపేట్ : వడ్డెర కులస్థుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం చిత్తారమ్మ దేవి ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ నూతన చైర్మన్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ విచ్చేసి నూతనంగా నియమితులైన వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుకను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ వడ్డెర కులస్థుల అభివృద్ధికి కార్పొరేషన్ చైర్మన్ కృషి చేయాలని సూచించారు. వడ్డెరుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నేతలు గుంజ శ్రీనివాస్, గోగుల సరిత, గిరిబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

# సిఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్'



ప్రజాపక్షం/చర్లపల్లి : హైదరాబాద్ ఎన్ఎఫ్‌సి,సిఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం 75వ ఎడిషన్ ఎంతో ఉత్సహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా శారీరక దారుఢ్యం,ఆరోగ్యకరమైన జీవనశైలి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని వారు అన్నారు. ఈ కార్యక్రమానికి కమాండెంట్ శంకర రావు బైరెడ్డి,అసిస్టెంట్ కమాండెంట్ హరేంద్ర ప్రత్యేక అతిథులుగా హాజరై మాట్లాడుతూ సైక్లింగ్ ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాడు అందించవచ్చునని,దేశాన్ని ఆరోగ్యవంతమైన శక్తివంతమైన భారతంగా తీర్చిదిద్దే దిశగా ఐక్యత,క్రమశిక్షణ,సేవాభావాన్ని ప్రతిబింబించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ సిబ్బంది,ఫిట్‌నెస్ అభిమానులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభల గోడపత్రిక విడుదల



ప్రజాపక్షం/బోడుప్పల్ : బోడుప్పల్ సర్కిల్ భగత్ సింగ్ నగర్ మేడ్చల్ జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి కె.ప్రమీల, వెంకటాచారి, దండు రమేష్ ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలి మేడ్చల్ జిల్లా 4వ, రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని గోడపత్రిక విడుదల చేయడం జరిగినది. స్వాతంత్ర పోరాటం నుండి తెలంగాణ సాయుధ పోరాటంలో, ప్రత్యేక తెలంగాణ పోరాటంలో పాల్గొని అనేక ఆటపాట మాటల ద్వారా తమ గళాలు వినిపించి నిత్యం ప్రజా సమస్యల కోసం పాటలు వినిపించే తెలంగాణ ప్రజానాట్యమండలి మహాసభలు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు.కల కల కోసం కాదు కలప్రజల కోసం అని వృత్తి కళాకారులకు అండదండగా నిలుస్తూ, అనేక పోరాటాల్లో ముందు భాగంలో ప్రజానాట్యమండలి నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపిరాజు, సైదమ్మ, మాధవి,రమాతార, మహాలక్ష్మి, నరసమ్మ, అండాలు, ఐలయ్య, ఇస్తారి, సోమరాజు, టిక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి : బండారి



ప్రజాపక్షం/ఉప్పల్ : ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ డివిజన్‌లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పూనం భవన్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ప్రజల్లో పార్టీకి ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్ణ నాగేశ్వర్ రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, పసుల ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ముత్యాల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఎంటి నగర్‌లో రూ.40లక్షల సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాపక్షం/ఉప్పల్ : ఉప్పల్ నియోజకవర్గంలోని హెచ్ఎంటి నగర్‌లో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిమెంటు రోడ్ల నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, హెచ్ఎంటి నగర్‌లో ఇప్పటికే రూ.70 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల పనులు పూర్తికావొచ్చాయని తెలిపారు. అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతాయని, ఇంకా కొత్తగా వేయాల్సిన రోడ్లు ఏమైనా ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కాలనీ ప్రజలకు సూచించారు. హెచ్ఎంటి నగర్ చెరువును ఖాళీ చేయించడంపై కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు సాయిజెన్ శేఖర్, మేకల ముత్యం రెడ్డి, మేడల మల్లికార్జున్ గౌడ్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుచ్చయ్య, రామ్, కోటేశ్వరరావు, యాదగిరి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# లుంబినీపార్క్‌లో అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం



- మొన్న సెక్యూరిటీగార్డు మృతి..నిన్న మహిళ ఆత్మహత్య ● వరుస విషాదాలతో భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు.. ● బోటింగ్ నిబంధనలు.. సీసీ కెమెరాల అమలుపై చర్చ



ప్రజాపక్షం/హైదరాబాద్: హుస్సేన్‌సాగర్‌లో మహిళ మృతి ఘటన నేపథ్యంలో పర్యాటక భద్రత, బోటింగ్ నిర్వహణ విధానాలు, నిఘా వ్యవస్థలపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.ఈ నెల 13న బోట్ నుంచి నీళ్లలోకి దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసు లు దర్యాప్తు కొనసాగిస్తుండగా, ప్రజల్లో భద్రతా ప్రమాణాల అమలు అంశంపై చర్చ మొదలైంది.ఇటీవలే సె క్యూరిటీ గార్డు బోట్‌లో మద్యం తాగి ప్రమాదవశాత్తు జారీ నీళ్లలో పడిపోయి మృతి చెందాడు..మరుసటి రో జు నీళ్లపై శవం తేలిఉండడంతో ఘటన వెలుగు చూసిం ది. తాజాగా మహిళా మృతదేహం కూడా నీళ్లపై తేలడం తో మరోసారి ఘటన వెలుగు చూసింది. ఈ రెండు ఘటనలలో లుంబినీపార్క్‌లోని టూరిజం శాఖకు చెందిన అ ధికారుల నిర్లక్ష్యం కొట్టోచ్చినట్లు కనిపిస్తుంది.నిజానికి ఒంటిరిగా వచ్చే వారికి బోటింగ్‌కు అనుమతించరు, వారికి బుకింగ్ కౌంటర్‌లో బోటింగ్ టికెట్లు కూడా ఇవ్వరు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన అధికారులు ఒంటరిగా వచ్చిన బడంగ్‌పేట్‌కు చెందిన భవ్య కీర్తన (33) ఈ నెల 13న బోటింగ్ టికెట్ ఇచ్చారు. ఆ తరువాత బుద్ధ విగ్రహం వద్దకు బోట్‌లో వెళ్లిన కీర్తన నీళ్లలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం బోట్‌లో ఉన్న ఎవరు గమనించలేదు. మరుసటి రోజు ఉదయం నీళ్లలో శవం తేలడంతో ఈ ఘటన వెలుగు చూసింది. ఒంటరిగా వచ్చిన మహిళకు టికెట్ ఇవ్వకపోతే ఈ ఘటన జరిగి ఉండేది కాదని తెలుస్తుంది. ప్రస్తుతం చర్చకు వస్తున్న అంశాల్లో ఒకటి బోటింగ్ సేవల నిర్వహణలో అమలులో ఉన్న నిబంధనలు, వాటి పర్యవేక్షణ. ఘటన సమయంలో బాధితురాలు ఒంటరిగా బోటింగ్‌కు వెళ్లారా? టికెట్ జారీ విధానం ఏమిటి? సంబంధిత సిబ్బంది నిబంధనలు పాటించారా? వంటి అంశాలు విచారణలో స్పష్టత రావాల్సి ఉంది. అలాగే బోటింగ్ కేంద్రాలు, ప్రవేశ మార్గాలు, పార్కు పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పని తీరు, ఫుటేజీ అందుబాటులో ఉందా లేదా అనే అంశాలు కూడా కీలకంగా మారాయి. ఘటన సమయంలో నిఘా వ్యవస్థ సమర్థంగా పనిచేసి ఉంటే పరిస్థితిని ముందుగానే గుర్తించే అవకాశం ఉండేదా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. భద్రతా నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రవేశ ప్రాంతాల్లో నిరంతర సీసీ కెమెరా పర్యవేక్షణ, అత్యవసర హెచ్చరిక వ్యవస్థలు, బోటింగ్ పాయింట్ల వద్ద సిబ్బంది పర్యవేక్షణ, అనుమానాస్పద పరిస్థితులను గుర్తించే శిక్షణ,అత్యవసర స్పందన బృందాలు వంటి చర్యలు అవసరమని సూచిస్తున్నారు. ఈ ఘటనతో హుస్సేన్‌సాగర్ వంటి ప్రజా ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. అయితే ఘటనకు సంబంధించి బాధ్యత, నిబంధనల ఉల్లంఘన జరిగిందా లేదా అనే అంశాలు అధికారిక దర్యాప్తు అనంతరం మాత్రమే తేలనున్నాయి.

# అక్రమ కట్టడాన్ని సీజ్ చేస్తున్నాం

## టౌన్‌ప్లానింగ్ ఏసిపి శ్రీనివాస్




ప్రజాపక్షం/మల్కాజిగిరి : ఎంఎంసి మౌలాలి సర్కిల్ పరిధిలోని వినాయకనగర్‌లో కొనసాగుతున్న అక్రమ కట్టడాన్ని సీజ్ చేసి కఠినంగా చర్యలు తీసుకొనేందుకు రంగం సిద్ధమైంది. గృహనిర్మాణాలకు అనుమతులు తీసుకొని యథేచ్ఛగా ఉల్లంగిస్తూ వాణిజ్య నిర్మాణాలు చేస్తున్న విషయాలపై ప్రజాపక్షంలో ఇటీవల వచ్చిన వార్తా కథనాలపై జోనల్, డిప్యూటి కమిషనర్లు టౌన్‌ప్లానింగ్ విభాగ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. అక్రమ కట్టడాలపై కఠినంగా వ్యమహరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ తనిఖీల్లో వినాయకనగర్‌లో గృహనిర్మాణానికి తీసుకొన్న అనుమతులు ఉల్లంఘించి వాణిజ్య అవసరాల కోసం నిర్మాణం చేపట్టినట్లు తేలందని, వెంటనే ఆ భవనాన్ని సీజ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని తెలిపారు. కాగా ఈ మేరకు ఆదేశాలు అందు కొన్న టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారి సంగీత ఉద్దేశ పూర్వకంగా చర్యలు తీసుకోవటంలో వెనుకంజ వేస్తూ తాత్సారం చేస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

# ధాన్యం తడవకుండా కొనుగోలు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ




ప్రజాపక్షం/వికారాబాద్ : జిల్లా వ్యాప్తంగా ధాన్యం , మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వర్షంలో తడవకుండా వెంటనే కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ అన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పాల్గొన్నారు. అనంతరం అయన మాట్లాడూతూ, అ కాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు . మొక్క జోన్న కొనుగోలు కేంద్రాల వద్ద కూడా రైతుల వేచి ఉండే పరిస్థితులు ఉండకూడదన్నారు. మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రభు త్వం నిర్దేశించిన కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా, అదనపు కలెక్టర్లు ఉమాశంకర్‌ప్రసాద్, వెంకటచారి, జెడ్‌పిసిఇఒ సుధీర్, డిఆర్‌డిఒ శ్రీనివాస్, సుదర్శన్ తదిరులు పాల్గోన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం


## పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ



ప్రజాపక్షం/కూకట్‌పల్లి : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతిగా నిరంతరం సేవలందిస్తున్నారని పిఏసి చైర్మన్ అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ఆదివారం వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీకి చెందిన రాజేందర్‌కు అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 2,75,000 ఆర్థిక సహాయానికి సంబంధించిన ఎల్ఓసి మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన పథకమని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు సిఎం సహాయనిధి ఆపన్నహస్తంలా నిలుస్తోందని, వైద్య చికిత్స కోసం ఆసుపత్రుల్లో చేరిన బాధిత కుటుంబాలకు ఇద్ది పెద్ద భరోసానిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శుభమ్ గ్రాండ్ బ్యాంకెట్ హాల్ ప్రారంభం

ప్రజాపక్షం / కూకట్‌పల్లి : కొండాపూర్ బొటానికల్ గార్డెన్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శుభమ్ గ్రాండ్ బ్యాంకెట్ హాల్‌తో పాటు శుభమ్ గ్రాండ్ టేగాండ్ అవే అండ్ కేటరింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. డా.యాళ్ల వరప్రసాద్, ఎం.వెంకటేశ్వరరావు ఆహ్వానం మేరకు బిజెపి రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మ ణ్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కో ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్, అఖిల భారత చిరంజీవి యువత రవణం స్వామినాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఒకేచోట ఆతిథ్యం, విందు, వినోదం, వేడుకలకు అనువైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ సంస్థలను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వేముల మహేష్, పోలెబోయిన శ్రీనివాస్, పోలెబోయిన గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# సందయ్య కుంటలో అక్రమ నిర్మాణాలు

- దర్జాగా భారీ కాంపౌండ్ వాల్ నిర్మాణం ● హైడ్రా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్



ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలోని సందయ్య కుంటలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టపడడంలేదు, చెరువులు, కుంటల పరిరక్షణకు హైడ్రా అధికారాలు ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేస్తున్నా కబ్జాలు ఆగడంలేదు. కుంటలు, చెరువులను, ప్రభుత్వ భూములను కాపాడేందుకు హైడ్రా అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్న స్థానిక అధికారుల తీరుతో కబ్జాలకు అడ్డుకట్టపడడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దుండిగల్ మండల పరిధిలోని సందయ్య కుంట లేక ఐడి 2854 విస్తీర్ణం 5.776 ఎకరాలు వాటర్ స్ప్రెడ్ ఏరియా 3.600 ఏకరాలుగా 2013, ఆగస్టు 27వ తేదీన ఇరిగేషన్ అధికారులు తేల్చారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ లను ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు స్థానిక నాయకుల అండతో కుంట కట్టు కాలువ పైన నిర్మాణాలు చేపడుతున్నారు. కొద్దికాలంగా సందయ్య కుంట కట్టు కాలువ పైన నిర్మాణాలు చేపడుతున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మౌనం వహిస్తున్నారు. ఫిర్యాదులు అందిన ఇరిగేషన్, రెవెన్యూ, అధికారులు కాలయాపన చేస్తుండడం పలు అనుమానాలకు తావిస్తుంది. కబ్జాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు కబ్జాదారులకు అండగా నిలిచేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కుంట నాలాపై భారీ ఫ్రీ కాస్ట్ వాల్ నిర్మిస్తున్నారంటూ ఫిర్యాదులు వస్తున్న అధికారులు చర్యలు చేపట్టడం లేదు కబ్జాలతో సంధ్య కుంట కుదించుకుపోవడంతో ఇప్పటికైనా హైడ్రా ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని సందయ్య కుంట కబ్జాలను అరికట్టాలని స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు.

# ప్రజపాలనలో నీటి కష్టాలు

## వాటర్ ట్యాంకర్ల చుట్టూ తిరుగుతున్న ప్రజలు..!




ప్రజాపక్షం/బోడుప్పల్ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ బుద్ధానగర్‌లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు స్థానికులతో కలిసి కాలనీల్లో పర్యటించి నీటి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ సమర్థవంతమైన తాగునీటి సరఫరా జరిగేదని, కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల చుట్టూ తిరిగే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. నీటి సమస్యపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్య క్తం చేశారు. అలాగే తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరి శంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడి తదితరులు పాల్గొన్నారు.

# జమ్ముకశ్మీర్‌లో కరాటేలో సత్తా చాటిన గౌరీ శంకర్



ప్రజాపక్షం/నవాబుపేట్ : జమ్మూ కశ్మీర్‌లో నిర్వహించిన కరాటే ప్రీమియర్ లీగ్ నేషనల్ లెవల్ టోర్నమెంట్‌లో ఎస్ఎస్ కెబి టీమ్ అద్భుత ప్రదర్శన చేసి ఘన విజయాన్ని నమోదు చేసింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారుల మధ్య జరిగిన ఈ పోటీల్లో ఎస్ఎస్ కె ఐటీ మ్ క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపిస్తూ గోల్డ్ మెడల్ గౌరీ శంకర్ కైవసం చేసుకున్నాడు. ఈ విజయంతో పులుమామిడి పరిసర ప్రాంతాల్లో క్రీడాభిమానుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ఈ టోర్నమెంట్ లో ఎస్ఎస్ కెఐ టీమ్ మొత్తం 7 గోల్డ్ మెడల్స్, 8 సిల్వర్ మెడల్స్, 9 బ్రాంజ్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయిలో తమ స్థాయిని చాటింది. ప్రతి విభాగంలో క్రీడాకారులు ధైర్యంగా పోరాడి ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చారు. ముఖ్యంగా ఫైనల్ రౌండ్లలో చేసిన ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ విజయాల్లో ప్రత్యేకంగా వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండల పరిధిలోనీ పులుమామిడికి గ్రామానికి చెందిన గౌరీ శంకర్ అద్భుతంగా రాణించి ఒక సిల్వరెమెడల్, ఒక బ్రాంజ్ మెడల్ సాధించడం విశేషం. ఈ సందర్భంగా ఎస్ఎస్.కె. ఐ టీమ్ సభ్యుల కు, విజేతలకు స్థానిక క్రీడాభిమానులు, గ్రామ పెద్దలు అభినందనలు తె లుపుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# కమ్యూనిటీ కాంటక్ట్‌లో భాగంగా తనిఖీలు



ప్రజాపక్షం/వికారాబాద్: మున్సిపల్ పరిధిలోని గరీబ్ నగర్‌లో ఉదయం 5గంటల నుండి 7గంటలకు వరకు కమ్యూనిటీ కాంటక్ట్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు జిల్లా ఎస్పి అదేశాల మేరకు డిఎస్‌పి అంజయ్య అధ్వర్యంలో ముగ్గురు సిఐలు, 11మంది ఎస్ఐలు ,100మందికి పైగా పోలీస్‌లు పాల్గోన్నారు. ఈ తనిఖీల్లో 55 ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలు, నిషేదిత గుట్క ప్యాకెట్లను స్వాధీం చేసుకున్నారు. ఐదుగురు రౌడీషీటర్లను గుర్తించి హోల్డింగ్ పాయింటికు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం డిఎస్‌పి మాట్లాడుతూ ఎవరైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడినా , ప్రజల్లో భయందోళనలు సృష్టించినా సహించేది లేదని ,వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రల పరిరక్షణ ,నేరాల నియంత్రణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించిన వెంటనే 100కు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ రఘుకుమార్ సిబ్బంది పాల్గోన్నారు.

# మహిళ నాలుక కోసిన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాపక్షం/చర్లపల్లి : మహిళ నాలుకను కోసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్ర కారం పిఎస్ పరిధిలోని శుభోదయ కాలనీలో నివాసముండే సుజాత పదేళ్ల క్రితం భర్త చనిపోయిన కొన్ని సంవత్సరాల క్రితం నవీన్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి అతనితో ఆరు నెలల నుండి శుభోదయ కాలనీలో అద్దెకు ఉంటుంది. శుక్రవారం రాత్రి నవీన్ సుజాత నాలుకను కోసాడు. ఇరుగు పోరుగు వారు సుజాత కుమారుడైన డేవిడ్‌కు సమాచారం అందించగా తల్లిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. నాలుకకు 18 కుట్లు వేశారు.పిఎస్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ



ప్రజాపక్షం/చర్లపల్లి : ఓ ఇంట్లో చోరీ అయిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చోసుకుంది. సిఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సైనిక్‌పురి హస్తినాపురి కాలనీకి చెందిన సిహెచ్ విజయలక్ష్మి భర్త నాగేశ్వర్‌రావు(68) 11 ఫిబ్రవరిన తన కుమార్తె, కుమారుడు వద్దకు అమెరికాకు వెళ్లింది. ఆదివారం ఉదయం 7 గంటలకు పని మనిషి యశోదమ్మ రోజు మాదిరిగానే పనికి వెళ్లగా మెయిన్ డోర్ లాక్ పగటగొట్టి ఉండడం గమనించి విజయలక్ష్మికి సమాచారం అందించగా ఆమె బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా అల్మారా తాళంను పగలగొట్టి అందులోని 3 తులాల బంగారం, కిలో వెండి, 5 వేల రూపాయల నగదు చోరీకి గురైనట్లు గమనించి పిఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# సుధాకర్‌నాయక్ ఘన నివాళి

ప్రజాపక్షం/శామీర్‌పేట : మూడుచింతలపల్లి మున్సిపాలిటీ లింగాపూర్‌తాండకు చెందిన బిజెపి జిల్లా ఎస్‌టి మోర్చ అధక్షుడు స్వర్గీయ కేతావత్ సుధాకర్ నాయక్‌కు బిజెపి నాయకులు ఘనంగా నివాళ్లర్పించారు. ఆదివారం కేశవరంలోని సూపర్ సంగీత్ ఫంక్షన్‌హాల్‌లో సుధాకర్ నాయక్ సంస్మరణ సభను మూడుచింతలపల్లి బిజెపి అధ్యక్షుడు తప్పెట్ల నరేందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం సుధాకర్ నాయక్ కుటుంబ సభ్యులకు దాతల సహాకారంతో సేకరించిన రూ.90 వేలు నగదు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుధాకర్ నాయక్ మృతి పార్టీకి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. అందరితో కలివిడిగా ఉండేవాడని ఆయన మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. సుధాకర్‌నాయక్ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు రామిడి హన్మంతరెడ్డి, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అమరం మోహన్‌రెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



